అధికారుల నిర్లక్ష్యం.. యజమానుల అలసత్వం

- రోడ్లపైకి వచ్చేస్తున్న మూగజీవాలు
- ప్రమాదకరంగా మారుతున్న వైనం

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని రహదారులు, ప్రధాన రోడ్లలో పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. ఈ క్రమంలో రోడ్లపై వెళ్తున్న వాహనాలకు ఆవులు, ఎద్దు అడ్డుగా రావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యం వైఖరి

అడపా దడపా కార్పొరేషన్ అధికారులు రోడ్లపై సంచరించే పశువులు(ఆవులు, ఎద్దులు)ను పట్టుకుని గో సంరక్షణ శాలకు తరలిస్తున్నారు. అయినా కూడా కొందరు తమ ఆవులను యథేచ్ఛగా రోడ్ల పైకి వదిలేస్తున్నారు. దీంతో నిత్యం నగరంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆవులను తమ నివాసాల వద్దనే ఉంచుకోవడంలో సంబంధిత యజమానులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. దీంతో నగరంలో అనేక రోడ్లలో ఆవులు సంచరిస్తున్నాయి.

నగరంలో ఇలా..

నగరంలోని జీఎన్టీరోడ్డు, ముత్తుకూరు రోడ్డు, పొదలకూరు రోడ్డు, మైపాడు రోడ్లపైనే రాత్రి సమయంలో ఆవులు, ఎద్దు సేదతీర్చుకుంటున్నాయి. ఈ క్రమంలో ఎండ, వాన, చలితో పాటు వాహనదారుల కారణంగా కొన్ని



రోడ్డు పక్కనే సేదతీరుతున్న గోవులు

ప్రాణాలు కోల్పోతున్నాయి. అలాగే కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మూగజీవాలను వివిధ ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా తరలించి, విక్రయిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. హిందువుల ఆరాధ్య దైవంగా భావించే ఆవులు ఆకలితో అలమటించి ప్రమాదాలకు గురై చనిపోతున్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి రోడ్లపై సంచరిస్తున్న పశువులకు రక్షణ కల్పించాలని, రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మైపాడు రోడ్డుపై సంచరిస్తున్న ఆవులు

అధికారులు స్పందించాలి



నగరంలో మూగజీవాలు ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తున్నాయి. వాటికి కనీసం ఆహారం, సేద తీర్చుకోవడానికి స్థలం లేక ప్రమాదాలకు గురవుతున్నాయి. మూగజీవాల యజమానులు పశువులను రోడ్లపై తిరగకుండా చూసుకోవాలి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– సుబ్బారెడ్డి, సత్యనారాయణపురం

పశువులను తిరగనీయొద్దు



నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా రోడ్లపై పశువులను తిరగనీయొద్దని ఆదేశాలు జారీ చేశాం. పశువులు రోడ్లపై తిరగడం మున్సిపల్ చట్టం ప్రకారం నేరం. అంతేకాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయి. గోవులను యజమానులు తమ గృహ ప్రాంగణాల్లోనే ఉంచుకోవాలి. లేని పక్షంలో సంబంధిత యజమానులపై చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ వైద్యుడు, ఎన్ఎంసీ

క్లుప్తంగా

మురళీకృష్ణకు సీపీఎం నేతల నివాళి



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : సీపీఎం జిల్లా సీనియర్ నేత, దివంగత మురళీకృష్ణ ఎనిమిదో వర్ధంతిని నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమంలో మురళీకృష్ణ పాత్ర ఎంతో కీలకమన్నారు. బీడీ కార్మికులు, పేపర్ మిల్లు కార్మికులు, హమాలీల హక్కుల కోసం జరిగిన పోరాటంలో మురళీకృష్ణ ఎంతో చురుగ్గా వ్యవహరించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి, వర్గ సభ్యురాలు రమాదేవి, సీనియర్ నాయకుడు చంద్ర రాజగోపాల్, జిల్లా కార్యదర్శి, వర్గ సభ్యులు మంగళ పుల్లయ్య, అజయ్‌కుమార్, నగర కార్యదర్శి, వర్గ సభ్యులు సూర్యనారాయణ, కాయల శ్రీనివాసులు, నాగేశ్వరరావు, గురనాథం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్) : హాస్పిటల్ వద్ద పార్కింగ్‌లో ఉన్న బైక్ చోరీకి గురైన ఘటనపై చిన్నబజారు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. వనంతోపు సెంటర్‌కు చెందిన సాయికుమార్ ముత్తుకూరు బస్టాండ్ సమీపంలో పెన్నా హాస్పిటల్‌లో పనిచేస్తున్నారు. ఆయన ఈనెల 7వ తేదీన తన యమహా ఆర్15 బైక్‌ను హాస్పిటల్ పార్కింగ్‌లో నిలిపి విధులకు వెళ్లారు. మరుసటి రోజు తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు గురువారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అయ్యప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కరకట్ట నిర్మాణానికి చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఈ దేశ్‌నాయక్

ఇందుకూరుపేట : పల్లిపాడు పరిధిలో పెన్నా పరీవాహక పరిధిలో కరకట్ట నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఇరిగేషన్ శాఖ ఎస్ఈ దేశ్‌నాయక్ తెలిపారు. మండలంలోని పల్లిపాడులో పెన్నానదిని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2021లో వచ్చిన విపత్తు సమయంలో గాంధీ ఆశ్రమం, పరిసర ప్రాంత గ్రామాలు వరదలకు గురైనట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో వాటి రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై పరిశీలించామన్నారు. వీటికి బలమైన కరకట్టలు ఏర్పాటు చేయాలా లేదా రక్షణ గోడలు నిర్మించాలా అనే అంశంపై ఆలోచిస్తున్నామన్నారు. బలమైన కరకట్టలు ఏర్పాటు చేసేందుకు సాధ్యసాధ్యాలు పరిశీలించి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఆయన వెంట గాంధీ ఆశ్రమ కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.

వీఎస్‌యూలో అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ

వెంకటాచలం: భూమి లేని రైతు కూలీల సామాజిక ఆర్థిక స్థితిగతులపై మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు మాట్లాడుతూ సాంకేతిక మార్పులపై అవగాహన కల్పించడం ద్వారా రైతు కూలీల జీవనోపాధిని మెరుగుపరిచే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, గ్రామీణ, అర్బన్ కూలీల మధ్య నెలకొన్న వ్యత్యాసాల గురించి వివరించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పరశురామయ్య రైతు కూలీల బాధలను వివరించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సదస్సులో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి వీసీని కలిసిన ఏపీటీఏ ఆర్డీ

వెంకటాచలం: ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ (ఏపీటీఏ) రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రమణ ప్రసాద్ విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావును గురువారం వర్సిటీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాల గురించి వారు చర్చించారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి



బహుమతుల ప్రదానం

నెల్లూరు (టౌన్) : మహిళలు అన్నిరంగాల్లో ముందుండి రాణించాలని క్షేత్ర ప్రచార సహాయాధికారి హరికృష్ణ తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక దర్గామిట్టలోని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి గురువారం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, శాస్త్ర సాంకేతిక రంగాల్లో మహిళలు ఉండడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం జ్యోతిర్మయి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి



డీసీఓ కార్యాలయంలో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

నెల్లూరు (టౌన్) : స్థానిక నేతాజీ స్కూల్‌లో సుభాస్ చంద్రబోస్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. తొలుత మినీబైపాస్‌లోని సుభాస్ చంద్రబోసు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వాతంత్ర్య పోరాటం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీసీఓ కార్యాలయంలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని జిల్లా సహకార శాఖ అధికారి(డీసీఓ) కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోసు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. అనంతరం డీసీఓ గుర్రప్ప మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య పోరాటంలో హిందూ, ముస్లిం, ఇతర మతాల వారిని ఐక్యం చేయడంలో నేతాజీ కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో డీసీఓ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

వందశాతం అక్షరాస్యత లక్ష్యం

- డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు (పొగతోట) : జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమం ద్వారా వందశాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి అధికారులను ఆదేశించారు. డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, ఏపీఎంలకు ఉల్లాస్ కార్యక్రమంపై గురువారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జిల్లాలో పొదుపు సంఘాల్లో నిరక్షరాస్యులను గుర్తించి అక్షర జ్ఞానం బోధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉల్లాస్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో అక్షర కేంద్రాలకు అభ్యాసకులందరూ క్రమం తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ మహ్మద్ అజాద్ మాట్లాడుతూ జిల్లాలో పొదుపు సంఘాల్లో 19,178 మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వారి కోసం ప్రత్యేకంగా రూపొందించిన పాఠ్య పుస్తకాలు, వీడియోల ఆధారంగా అక్షర జ్ఞానం కల్పించాలన్నారు. అనంతరం వయోజన విద్యకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఏపీఎంలు, ఎంపీడీఓలు, అడిషనల్ పీడీ రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

రేపట్నుంచి ఉచిత యోగా శిబిరం

నెల్లూరు(బృందావనం) : నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఈనెల 25, 26, 27వ తేదీల్లో ఉచిత సమీకృత యోగా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పతంజలి యోగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బాలోజీ యోగాచార్య తెలిపారు. రామ్‌నగర్‌లోని శిరిడీ సాయి చారిటబుల్ ట్రస్ట్ యోగా కేంద్రంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత భారత స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు బి.విజయకుమార్‌రెడ్డి, పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షుడు సీహెచ్.పెంచలయ్య, యోగా మిత్రమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీంద్రలతో కలిసి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలోజీ యోగాచార్య మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు.



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

54 డివిజన్లకు రెండు ఫాగింగ్ యంత్రాలా?

- కార్పొరేషన్ తీరుపై ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అసహనం

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలో దోమల సమస్య తీవ్రంగా ఉందని, 54 డివిజన్‌లకు రెండు ఫాగింగ్ యంత్రాలు మాత్రమే ఉండడంపై రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. రూరల్ నియోజకవర్గంలోని 34వ డివిజన్ ప్రగతినగర్ బి–బ్లాక్‌లో 'దోమలపై దండయాత్ర' కార్యక్రమాన్ని శ్రీధర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమల రాజధానిగా రూరల్ మారిందన్నారు. ఇంత పెద్ద నెల్లూరు కార్పొరేషన్‌కు ఫాగింగ్ యంత్రాలు కేవలం రెండు మాత్రమే ఉండడం సరికాదన్నారు. ఒక్క ఫాగింగ్ మెషీన్‌కు రూ.6.80 లక్షలు పడుతుందని, నగర కార్పొరేషన్‌కు పది ఫాగింగ్ మెషీన్లను కొనే శక్తి లేనిది కాదన్నారు. ప్రజాధనాన్ని ప్రజల కోసం ఖర్చు పెట్టాలని తెలిపారు. ప్రతి డివిజన్‌కు ఫాగింగ్ మెషీన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య సిబ్బంది కొరతపై మంత్రి నారాయణ దృష్టి సారించాలని కోరారు.

యువకుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్) : ఇంటి నుంచి యువకుడు అదృశ్యమైన ఘటనపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటలో వెంకటరమణ నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు తరుణ్ భాగ్యరాజ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. వెంకటరమణ గురువారం తన భార్యను స్కూల్ వద్ద వదిలేందుకు వెళ్లారు. ఈక్రమంలో చిన్న కుమారుడు ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. ఇంటికి వచ్చిన వెంకటరమణకు కుమారుడు కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలించాడు. కుమారుని జాడ తెలియకపోవడంతో చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ను ఏర్పాటు చేయాలి

నెల్లూరు(అర్బన్) : స్థానిక 29వ డివిజన్ గాంధీ నగర్‌లో ఉన్న అర్బన్‌హెల్త్ సెంటర్‌లో తక్షణమే ల్యాబ్ టెక్నీషియన్ను ఏర్పాటు చేయాలని ఆ వార్డు కార్పొరేటర్ షేక్.సత్తార్ కోరారు. ఈమేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాతకు గురువారం వైద్యశాఖ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రాంతంలోని హెల్త్ సెంటర్‌లో ల్యాబ్ టెక్నీషియన్ను రెండు నెలల క్రితం వేరే ప్రాంతానికి మార్చారన్నారు. ఇక్కడ మాత్రం ఖాళీగా ఉంచారన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా నిరుపేదలు జీవిస్తున్నారన్నారు. అందువల్ల తమ ప్రాంత ప్రజల ప్రయోజనాల రీత్యా లాబ్ టెక్నీషియన్ను ఏర్పాటు చేయాలని కోరారు.

బుచ్చిలో న్యాయ విజ్ఞాన సదస్సు



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రగతి చారిటబుల్ ట్రస్టులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక పిల్లల ఆరోగ్య పరిస్థితి, వసతి గృహం, భోజన వసతులను పరిశీలించారు. అలాగే వీరికి వైద్య సదుపాయం ఏ విధంగా అందుతుందని అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ సురేంద్ర, హోమ్ మేనేజ్‌మెంట్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

రిటైర్డ్ ఎంప్లాయీస్ సర్వసభ్య సమావేశం రేపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ది నెల్లూరు డిస్ట్రిక్ ఎలక్ట్రిసిటీ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఈనెల 25న జరుగుతుందని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సంపత్‌కుమార్, అధ్యక్షుడు శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని దర్గామిట్ట వద్ద ఉన్న ఎన్జీఓ అసోసియేషన్ కళ్యాణ మండపంలో జరిగే సమావేశానికి విశ్రాంత ఉద్యోగులు తప్పక హాజరుకావాలని కోరారు.

డయల్ యువర్ డీఎం-2 నేడు

నెల్లూరు సిటీ : ప్రయాణికులు తమ సమస్యలను తెలియజేసేందుకు నేడు(శుక్రవారం) డయల్ యువర్ డీఎం–2 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శివకేశవ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య 99592 25642 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సూచనలను తెలియజేయవచ్చని వివరించారు.

'త్యాగరాజ సంగీత వైభవం' రేపు

నెల్లూరు(బృందావనం) : పుర మందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో శనివారం సాయంత్రం 6 గంటలకు చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో 'శ్రీత్యాగరాజ సంగీత వైభవం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, వై.శేషగిరీశం గురువారం తెలిపారు. మల్లాది అనూష బృందంచే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. సంగీతాభిమానులు, కళాకారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మాంసం మార్కెట్లు శుభ్రంగా ఉండాలి

నెల్లూరు(బారకాసు) : వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మాంసం మార్కెట్లు, ప్రాంగణాలు అత్యంత పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగరపాలక కమిషనర్ సూర్యతేజ తెలియజేశారు. పారిశుద్ధ్య పర్యవేక్షణలో భాగంగా స్థానిక 39వ డివిజన్ చేపల మార్కెట్, మటన్ మార్కెట్ ప్రాంగణాలను కమిషనర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లలో అవసరమైన మేరకు విద్యుద్దీపాలు, ఫ్యాన్లు ఇతర విద్యుత్ పరికరాలను ఏర్పాటు చేసి వ్యాపారస్తులు, వినియోగదారులకు సౌలభ్యం కల్పించాలని సూచించారు. ప్రతి వ్యాపారస్తుడు తప్పనిసరిగా నగరపాలక సంస్థ నుంచి ట్రేడ్ లైసెన్సులు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ రామ్మోహన్‌రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ మదన్‌మోహన్, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



చేపల మార్కెట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

దేవరపాళెం సచివాలయంలో ఆకస్మిక పరిశీలన

నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని దేవరపాళెం సచివాలయాన్ని జెడ్పీ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి మోహన్‌రావు గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలేంద్రకుమార్ పాల్గొన్నారు.



కేంద్రీయ విద్యాలయంలో క్విజ్ పోటీలు

నెల్లూరు సిటీ : రూరల్ పరిధిలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం క్విజ్ పోటీలు నిర్వహించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ నుంచి వంద మంది విద్యార్థులు పాల్గొన్న పోటీల్లో ప్రథమ బహుమతి కేంద్రీయ విద్యాలయానికి చెందిన విక్రమ్‌రెడ్డి, రెండో బహుమతి జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన సాన్వి అనిల్, మూడో బహుమతి కేంద్రీయ విద్యాలయానికి చెందిన మహమ్మద్ ఒమర్‌లు దక్కించుకున్నట్లు ప్రిన్సిపల్ కె.శంకరయ్య తెలిపారు. ముఖ్య అతిథులుగా కృష్ణపట్నం పోర్టు కస్టమ్స్ అధికారి క్రిష్ణేంతు రాజమింటూ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీసీఏ కో–ఆర్డినేటర్ అలివేలు మంగాబాయ్, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దొరసానమ్మ, జోషిబాబు, ప్రణీత, సునీల్‌కుమార్, రవికుమార్, ప్రభాకర్, రవిరాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ఉద్యమ గేయాల సీడీ ఆవిష్కరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ సమర్పించిన ఉద్యమ గేయాల సీడీని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ఆవిష్కరించారు. నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు జరిగే పార్టీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా ఈనెల 27, 28, 29వ తేదీల్లో ముత్తుకూరు గేట్ సెంటర్‌లో జరిగే సింహపురి సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు మోహన్‌రావు, రెహానాబేగం, పుల్లయ్య, నాగేశ్వరరావు, సూర్యనారాయణ, చంద్ర రాజగోపాల్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి గండవరపు శేషయ్య, విజయ్‌కుమార్, పాటల రచయితలు వెంకయ్య, వినయ్, సంగీత దర్శకుడు చైతన్యకుమార్, చక్రపాణి పాల్గొన్నారు.



నగరాభివృద్ధిలో భాగస్వాములవ్వాలి



మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : నగర వ్యాప్తంగా చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి సూచనలు అందించి భాగస్వాములు కావాలని నెల్లూరు వెల్ఫేర్ ఫెడరేషన్ సభ్యులకు కమిషనర్ సూర్యతేజ సూచించారు. ఫెడరేషన్ ఎనిమిదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని రామ్మూర్తినగర్‌లో ఉన్న పద్మావతి కమ్యూనిటీ హాల్‌లో వేడుకలను గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కమిషనర్ పాల్గొని, నేతాజీ సుభాస్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వివిధ అంశాలపై మాట్లాడారు. ప్రజాపార్కుల నిర్వహణలో స్థానిక అసోసియేషన్లు, ఫెడరేషన్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ సందర్భంగా లొకాలిటీ అసోసియేషన్స్ గైడెన్స్‌కు సంబంధించిన పుస్తకాన్ని కమిషనర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు కృష్ణయ్య, అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి పీఎస్ నాయుడు, జాయింట్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, ట్రెజరర్ శ్రీనివాసచారి పాల్గొన్నారు.